క్లుప్తంగా

కాళ్లలో 14 దుకాణాలకు అనుమతి



కాళ్లలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

కాళ్ల: దీపావళి సందర్భంగా కాళ్ల మండలంలో 21 గ్రామాల్లో మొత్తం 14 బాణసంచా దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ జి.సుందర్ సింగ్ శనివారం తెలిపారు. మండలంలో ఏలూరుపాడులో 4, కాళ్లలో 2, కాళ్లకూరులో 1, పెదఅమిరంలో 3, సీసలిలో 2, జువ్వలపాలెంలో 1, బొండాడలో 1 చొప్పున బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తరపున అనుమతులు వచ్చినట్లు తెలిపారు. దుకాణాల వద్ద నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో ఇంకా అనుమతులు రాకుండానే అమ్మకాలు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గ్యాస్ వాడకాన్ని పెంచాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్యాస్ వాడకం పెంచాలని ర్యాలీ నిర్వహించిన దృశ్యం

ఆకివీడు: వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు గ్యాస్ వినియోగాన్ని పెంచాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఫరూక్ పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం గ్యాస్ వినియోగంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితమైన గ్యాస్ వినియోగం ఆరోగ్యకరమన్నారు. స్వచ్ఛఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉజ్వల పథకం ద్వారా కొత్త కనెక్షన్లు పొందాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీ.ఆంజనేయులు, హెచ్‌పీ డీలర్లు, డ్వాక్రామహిళలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు విశేష పూజలు



మావుళ్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో మావుళ్లమ్మ దేవస్థానంలో ధనత్రయోదశి సందర్భంగా మహాలక్ష్మి కుబేర ధనపూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఏ. శ్రీరామ్ నేతృత్వంలో ఆయుష్ సిబ్బంది సహకారంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలియజేశారు. వైద్య శిబిరానికి సహకారం అందించిన. వైద్య సిబ్బందిని ఘనంగా సత్కరించారు.

చినమిల్లి పరామర్శ



భారతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న చినమిల్లి వెంకటరాయుడు

భీమవరం అర్బన్: వైఎస్సార్ సీపీ మండల కమిటీ సభ్యుడు మద్దా ఫిలిప్ భార్య భారతి శస్త్ర చికిత్స చేయించుకోవడంతో శనివారం మండలంలోని గూట్లపాడు గ్రామంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు పరామర్శించారు. భారతి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకుని విశ్రాంతి తీసుకుని వైద్యుల సూచనలు పాటించాలన్నారు. అధైర్య పడవద్దని మేమంతా అండగా ఉన్నామని ఫిలిప్‌కు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, మాజీ ఎంపీటీసీ పెనుమాల నరసింహస్వామి, గుద్దటి ఆంజనేయులు సంధి డేనియల్, మురళీ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ ఆకస్మిక తనిఖీ

పాలకొల్లు సెంట్రల్: షెడ్యూల్ ప్రకారం కాంప్లెక్స్ మీటింగ్‌ల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు నూరు శాతం లేకపోయినా చర్యలు తప్పవని సర్వశిక్షా అభియాన్ ఏఎస్‌ఓ ముదునూరి నారాయణరాజు హెచ్చరించారు. శనివారం స్థానిక క్లస్టర్ పాఠశాలల్లో ఆయన ఆకస్మిక క్లస్టర్ కాంప్లెక్స్ తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. ఆధార్ అప్డేషన్‌కు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ ఝాన్సీ లక్ష్మీబాయి, సెక్రటరీ రాయపూడి భవానీప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పడాల పల్లపు రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారో?

- మహిళలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- గత వైఎస్సార్ సీపీ హయాంలో అందజేసిన పథకాలకు మంగళం
- ఉండి నియోజకవర్గంలో 91,000 మంది ఎదురుచూపులు



ఎన్నికల సమయంలో కూటమి పార్టీ ప్రకటించిన ఆడబిడ్డ నిధి పథకం హామీ లోగో

పాలకోడేరు: అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి పేరుతో మహిళలకు ప్రతి నెల రూ.1500లు అందజేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు వాగ్దానం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 17నెలలు గడుస్తున్నా ఈ పథకంపై స్పష్టత ఇవ్వడం లేదు. దీనికితోడు వైఎస్సార్ సీపీ హయాంలో మహిళలకు అందజేసిన వైఎస్సార్ చేయూత, కాపునేస్తం, 0వడ్డీకి రుణాలు, అమ్మ ఒడి పథకాలను కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. మహిళలకు ఇచ్చిన ఆడబిడ్డ నిధి ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వాలని మహిళలు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో సుమారు 91,000వేల మంది మహిళలు ఈ పథకం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఎన్నికల హామీలను తుంటలో తొక్కి పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య, అంతేగాకుండా సంక్షేమ పథకాలను కూడా తూతూ మంత్రంగా అమలు చేసి అనుకూల మీడియాలో ఆహో ఓహో బ్రహ్మాండం రాయించుకోవడంలో ఆయనకు మించిన సిద్ధహస్తుడు మరెవరూ ఉండరు. ప్రభుత్వ తీరు చేస్తే ఆడబిడ్డ నిధిని గంగలో కలిపినట్టే అని నియోజకవర్గ మహిళలు అభిప్రాయపడుతున్నారు.

గతంలో మహిళల జీవనోపాధికి అండగా...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళల జీవనోపాధికి పెద్దపీట వేశారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత లాంటి అనేక ముఖ్యమైన పథకాలన్నింటినీ నేరుగా మహిళల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసివారి ఆర్థికాభివృద్ధికి అండగా నిలిచింది. మహిళల చేతికి చేరిన నగదు వృథా కాకుండా ఇంటి అవసరాలకు ఉపయోగపడుతుందని భావించి అనేక పథకాల డబ్బును మహిళల ఖాతాకే జమ చేశారు.

రూ.232కోట్ల బకాయిలు

నియోజకవర్గంలో 1,31,000 లక్షల మంది మహిళలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. 60ఏళ్లు పైబడిన వారిని మినహాయిస్తూ 2024 అక్టోబర్ నాటి లెక్కల ప్రకారం 59ఏళ్లలోపు వారు 91,000మంది మిగులుతారు. వీరికి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.1500చొప్పున చెల్లిస్తే రూ.133,029,000 చెల్లించాల్సి ఉంటుంది. ఈలెక్కన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17నెలలకు రూ.2,261,493,000లు చెల్లించాల్సి ఉంది. ఈ నగదు ఎప్పుడు చెల్లిస్తారని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఈ మొత్తాన్ని ఒకే విడతలో చెల్లించడంతో పాటు రాబోయే రోజుల్లో నెలనెలా రూ.1500చెల్లించాలని మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆడబిడ్డ నిధి పథకం ఎప్పుడిస్తారు?



కూటమి ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న ఆడబిడ్డ నిధి ఎప్పుడు ఇస్తారో వెంటనే చెప్పాలి. హామీ ఇచ్చి రెండేళ్లు కావొస్తున్న ఈ ఊసే ఎత్తడం లేదు ఇచ్చిన మాట ప్రకారం పథకాన్ని అమలు చేయాలి. దీంతో పాటు 17నెలలు బకాయిలు కూడా వెంటనే చెల్లించాలి. హామీలు విస్మరించి మహిళలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుంది

కె దుర్గ, మోగల్లు

మోసం చేయడం తగదు



అధికారంలోకి రాక ముందు ఒకలా, వచ్చాక మరోలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మహిళలను మోసం చేయడం తగదు వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతాం. ఎన్నికల సమయంలో కూటమి నేతలు 18ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ 1500ఇస్తామని నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చారు. ఇప్పటి వరకు ఆదిశగా ఆలోచన చేయకపోవడం దుర్మార్గం.

కె మరియమ్మ కుముదవల్లి

చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలను మాయ మాటలతో మభ్య పెట్టి ఇప్పుడు వంచనకు గురి చేసింది. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయకపోవడం మహిళలను మోసం చేయడమే. కూటమి నేతలు మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారే గాని, పథకాల గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పథకం అమలు చేసి మహిళల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

ఎస్ ఎల్ ప్రియ పాలకోడేరు

భీమవరం ఓపెన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం



భీమవరం ఓపెన్ టెన్నిస్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: క్రీడలు శరీరక మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం టౌన్ హాల్లో శనివారం 9 రోజులపాటు జరిగే భీమవరం ఓపెన్ సీజన్ -3 టెన్నిస్ పోటీలను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో క్రీడలను ఆస్వాదించాలని, ఈ క్రీడల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎదగాలన్నారు. క్లబ్‌లు అభివృద్ధి చెందాలంటే క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి నిరంతరం పోటీలను నిర్వహించాలన్నారు. ఉత్తమమైన క్లబ్‌లుగా ఉండాలని, రానున్న రోజుల్లో మరెన్నో పోటీలను నిర్వహించాలన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కోళ్ల రామచంద్రరావు, బేతు కృష్ణారావు, టెన్నిస్ ఆర్గనైజర్ కొప్పర్తి రవిబాబు మాట్లాడుతూ భీమవరంలోని టౌన్ హాల్, కాస్మో పాలిటిన్, యూత్ క్లబ్‌లలో 9 రోజులపాటు మూడు క్లబ్‌లో 88 మ్యాచ్‌లు జరుగుతాయని, 26న టౌన్ హాల్లోనే ముగింపు వేడుకలు బహుమతుల ప్రధానోత్సవం జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో టెన్నిస్ ప్లేయర్స్, క్లబ్ సభ్యులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

భీమవరంలో బాలోత్సవాలు



భీమవరంలో బాలోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరంలో డిసెంబర్ 11, 12 తేదీల్లో బాలోత్సవాలను నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. శనివారం బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి సిహెచ్ పట్టాభిరామయ్య అధ్యక్షతన సుందరయ్య భవనంలో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన అమరావతి బాలోత్సవం నిర్వహకులు పి మురళీకృష్ణ మాట్లాడుతూ బాలోత్సవాలు నిర్వహించడం వల్ల బాలల్లో మానసిక వికాసం, వివిధ కళా రూపాల నైపుణ్యం, దేశభక్తి, మానవత్వ విలువలు, నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. బాలల ప్రతిభా పాటవాలూ, శక్తిసామర్థ్యాలు పెరుగుతాయన్నారు. అనంతరం బాలోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ సభ్యులు గాతల జేమ్స్, పాకలపాటి సీతా రామరాజు, మల్లుల శ్రీనివాస్, జి రఫాయేలు, చైతన్య ప్రసాద్, పి శ్రీనివాసరాజు, బాషా, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ఉండిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఉండిలో స్వచ్ఛంధ్ర- స్వర్ణాంధ్రపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అలాగే జీఎస్టీ తగ్గింపు తదితర అంశాలపై ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీఓ సీఎస్‌వీ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విధిగా మొక్కలు నాటాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే వాయి కాలుష్యాన్ని తగ్గించేందుకు వాహనాల వినియోగాన్ని తగ్గించుకుని సైకిల్స్ వినియోగించాలని అన్నారు.అలాగే విద్యుత్‌ను ఆదా చేసేందుకు సోలార్‌ను వినియోగించుకోవాలని సూచించారు. దీనివల్ల విద్యుత్ ఆదా అవ్వడమే కాకుండా వినియోగదారులకు మంచి లాభం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజు, ఆర్‌ఐ కార్తీక్, ఎంపీడీవో, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలి



అనాకోడేరులో హైస్కూల్లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భీమవరం అర్బన్: విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలని జిల్లా చెకుముకి కన్వీనర్ రేపాక వెంకన్నబాబు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరు గ్రామంలో డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు -2025 నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా చెకుముకి కన్వీనర్ రేపాక వెంకన్న బాబు మాట్లాడుతూ ప్రపంచం సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతుందని దేశాలన్నీ ఒకే వేదికపైకి వస్తున్నాయన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై ఆసక్తిని కనబరిచి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ పోటీల్లో జి. జయనాగ సుమశ్రీ, ఎమ్ హాసిని, కె. హర్షవర్ధన్‌లను విజేతలుగా ప్రకటించి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్. శ్రీ సూర్యభగవాన్ రాజు మాట్లాడుతూ ఈ పోటీలకు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. శస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. వనజ, కేవీవీ సాగరరాజు, ఎంపీ శ్రీలక్ష్మి, ఎస్ శారద, ఎస్ మావుళ్లమ్మ, సీహెచ్ శ్రీనివాస్, ఎస్ ప్రేమరాజు, వీఆర్ఎస్ఎస్ఎన్ మూర్తి, పి. అరుణ కుమారి, కె. గిరిజా రమాదేవి, సీహెచ్ జలాబాయి, ఎమ్ బాల పల్లాలరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికకు న్యాయం చేయాలని వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పాలకొల్లు మండలం వెలివెల గ్రామానికి చెందిన మైనర్ బాలికను చేబ్రోలు గ్రామానికి చెందిన కనుబోయిన మహేంద్ర మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేశాడని, ఆ బాలికకు న్యాయం చేయాలని దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి డీఆర్వో సీసీ రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ దీనిపై అధికారులు వెంటనే స్పందించి మైనర్ బాలికకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మైనర్ బాలికకు ఒక పాప కూడా పుట్టిందని, బాలికను వదిలేసి మానసికంగా వేధిస్తున్నారని, దీనిపై పాలకొల్లు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని ఆయన వాపోయారు. కార్యక్రమంలో మాగపు శ్రీనివాస్, పట్టెం శుభాకర్, అంబటి ఆనంద్ కుమార్ మహిళలు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో డీఎన్నార్ విద్యార్థుల ప్రతిభ



యూత్ ఫెస్టివల్‌లో విజేతలైన డీఎన్నార్ కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ ఆధ్వర్యంలో తణుకు ఎస్‌కెఎస్‌డీ ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి యూత్ ఫెస్టివల్ సాంస్కృతిక కార్యక్రమాల్లో డీఎన్నార్ విద్యార్థులు వివిధ బహుమతులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ జి మోజెస్ చెప్పారు. బహుమతులు గెల్చుకున్న విద్యార్థులను శనివారం కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు అభినందించి సందర్భంగా వివరాలను వెల్లడించారు. యువజనోత్సవాల్లోని జానపద గ్రూప్ నృత్యం, సోలో నృత్యంలో ప్రథమ స్థానాన్ని, కూచిపూడి నృత్యం, డ్రాయింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఏటా నిర్వహిస్తున్న యువజనోత్సవాల్లో తమ కళాశాల విద్యార్థులు పలు బహుమతులు గెల్చుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పి రామకృష్ణంరాజు, ఎ సురేంద్ర, కళాశాల సాంస్కృతిక విభాగ కన్వీనర్ లక్ష్మీభవాని, టి చిట్టిబాబు పాల్గొన్నారు.

చేపపిల్ల వేయకుండా అడ్డుకున్నవారిపై కేసు

ఉండి: చెరువులో చేపపిల్ల వేయకుండా అడ్డుకున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపిన వివరాల ప్రకారం.. కోలమూరు గ్రామానికి చెందిన తాటిపట్టి నాగులుకు అదే గ్రామ పరిధిలోని చేపల చెరువులో శుక్రవారం చేపపిల్ల వేసేందుకు ఆటపాక నుంచి కొనుగోలు చేసి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పాములపర్రు వంతెన వద్ద చేపపిల్ల వ్యాన్ ఆపి నడకదారిలో చేపపిల్ల మోస్తుండగా పాములపర్రు గ్రామానికి చెందిన దర్శి బాబీ, ఇంటి సుందరం, ఇంటి అబ్రహాం, దర్శి బుడ్డియ్య, మరి కొందరు అడ్డగించి చేపపిల్ల దించడానికి వీలు లేదని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న రైతు నాగులు వెళ్లి ఆరా తీయగా నీ అంతుచూస్తానని బెదిరించినట్లు, అడ్డుకోవడంతో రూ.10 వేల విలువైన చేపపిల్ల చనిపోయినట్లు నాగులు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భీమవరం: సమాజంలో స్త్రీ, పురుష బేరాలు నేటికి కొనసాగుతుండడం అత్యంత బాధాకరమని ఇటువంటి తరుణంలో సమానత్వం కోసం పోరాడాల్సిన అవసరం ఎంతో ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ పావనీ అన్నారు. శనివారం భీమవరంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా గర్ల్ కన్వెన్షన్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అసమానతలు రాజ్యమేలుతున్నాయని, రాజ్యాంగంలోని సమాన హక్కుల సాధనకు అంతా నడుం బిగించాలన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని మహిళలకు రక్షణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులపై స్కూల్స్, కళాశాలల్లో లైంగిక వేధింపులు, దాడులు నిరంతరం జరుగుతున్నాయని వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యార్థినులకు విద్య అందటం లేదని విద్య ప్రైవేటీకరణ వల్ల అందని ద్రాక్షలా మారిందని, ప్రభుత్వం అందరికీ సమానత్వంతో కూడినటువంటి విద్యనందించాలని పావనీ డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి టి ప్రసాద్ మాట్లాడుతూ చరిత్ర పాఠ్యాంశాల్ని తీసివేసి మతోన్మాదంతో మూఢనమ్మకాలని పాఠ్యాంశంలో పెడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస అవకాశాలు కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాన్ హామీ ఇచ్చినా సుగాలి ప్రీతి కేసు నేటికీ నెరవేరకపోవడం దురదృష్టకమన్నారు. అనంతరం జిల్లా గరల్స్ కన్వీనర్‌గా బి సింధు, కో కన్వీనర్లుగా ఎం భాగ్యలక్ష్మి, టి రేష్మతో సహా 14 మందితో జిల్లా గరల్స్ కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు.

భీమవరంలో న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ శిబిరం



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో చెక్కును అందజేస్తున్న దృశ్యం

భీమవరం: లీగల్ సర్వీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ బి లక్ష్మీనారాయణ అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ, రెవెన్యూ, మునిసిపల్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ తదితర శాఖల సమన్వయంతో శనివారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ శిబిరంలో ఆయన మాట్లాడారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కె రత్నప్రసాద్ మాట్లాడుతూ బాలల ప్రయోజనాల కోసం న్యాయ సేవా సంస్థలు కృషి చేస్తున్నాయని, బాలల హక్కుల పరిరక్షణకు 2024లో చట్ట రూపకల్పన జరిగిందన్నారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను న్యాయమూర్తులు సందర్శించి ఆయా శాఖల ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం దివ్యాంగులకు వీల్ చైర్లు, సదరం సర్టిఫికెట్స్, వివిధ శాఖల పెండింగ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం .సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి సురేష్‌బాబు, ఎస్పీ అద్నామ్ నయీం అస్మి, ఏఎస్పీ వి భీమారావు, జిల్లా రెవెన్యూ అధికారి బీఎస్ఎన్ రెడ్డి, భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మునిసిపల్ కమీషనర్ కె రామచంద్రారెడ్డి, డీఎస్పీ ఆర్‌జే జయసూర్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

21 నుంచి ‘ఉపాధి’ గ్రామసభలు

ఉండి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల గుర్తింపులో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ నుంచి 28వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయతీల వద్ద గ్రామ సభలు నిర్వహించి అవసరమైన పనులను గుర్తించి ఆమోదించడం జరుగుతుందన్నారు. 21వ తేదీన చిలుకూరు, మహదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం, 22వ తేదీన ఆరేడు, కలిగొట్ల, పాందువ్వ, 23న చినపుల్లేరు, పెదపుల్లేరు, వాంద్రం, 24న పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు, 25న అర్తమూరు, చెరుకువాడ, కలిసిపూడి, 27న యండగండి, ఉణుదుర్రు, 28న వెలివర్రు, ఉండి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి బడ్జెట్ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ గ్రామ సభల నిమిత్తం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు టాంటాం ద్వారా గ్రామ ప్రజలందరికీ తెలియజేయాలని ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు గ్రామ సభకు హాజరైయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో తెలిపారు.

సందడి లేని దీపావళి

ఆకివీడు: దీపావళి పండుగ సందడి లేకుండా పోయింది. వారం రోజుల ముందు నుంచే దీపావళి బాణసంచా కాల్చుతూ యువత ఉత్సాహంగా తిరిగేవారు. ప్రజల వద్ద డబ్బు లేకపోవడంతో దీపావళి పండగు వెలవెలబోతుంది. గత ప్రభుత్వంలో వలే ప్రజలకు సంక్షేమ పథకాల సొమ్ము అందకపోవడం, పంటలకు ధర లేకపోవడం, పెట్టుబడులు భారీగా పెరిగిపోవడం, ఆక్వా రంగం కుదేలవ్వడంతో ఆర్థిక మాధ్యంతో ప్రజలు కొట్టుమిట్టాడుతొన్నారు. ఇతర వ్యాపారాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. కిరాణా, దుస్తుల షాపులు, ఇతర షాపులన్నీ బేరాలు లేక బెంబేలెత్తిపోతున్నారు. దీపావళి మందుగుండు సామన్లు కొనుగోళ్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ధరలు అధికంగా ఉన్నాయని, అయినప్పటికీ దీపావళి పండుగ సరదా కోసం కొనాల్సి వస్తుందంటున్నారు. రైటైల్ దీపావళి మందగుండు షాపుల్లో ధరలు ఏ విధంగా ఉంటాయోనంటున్నారు. ఏది ఏమైనా దీపావళి పండుగు పేలవంగా సాగిపోతుందంటున్నారు.

విద్యార్థులకు స్వీట్ల పంపిణీ



బధిర పాఠశాలలోని విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని వెంకటేశ్వర బధిర పాఠశాలలోని విద్యార్థులకు దీపావళి సందర్భంగా శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం స్వీట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్రీడా అసోసియేషన్ సభ్యుడు పెన్మెత్స శ్రీధర్ మాట్లాడుతూ బధిరుల పాఠశాలలో పండుగ వాతావరణం ముందే కన్పిస్తోందని విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి స్వీట్స్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు మాట్లాడుతూ పాఠశాలలో 100 మంది విద్యార్థులున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగ సాయి, ఉపాధ్యాయులు విజయ, కీర్తన, అరుణ, హిమబిందు, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.